క్లుప్తంగా

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత



శాయంపేట : మండలంలోని నేరేడుపల్లి గ్రామానికి చెందిన కాదరి శంకర్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి సర్పంచ్ జనగాం మంజుల సత్యనారాయణ పరామర్శించారు. ఈ సందర్భంగా క్వింటాల్ బియ్యాన్ని అందించారు. ఆయన వెంట ఉపసర్పంచ్ కటకం రాజ్‌కుమార్, నాయకులు మోత్కూరు రాజ్‌కుమార్, మంద రాజన్న, పల్లె కృష్ణయ్య, ఆకుతోట సతీష్, కటకం జనార్ధన్, నోముల రవి, గాజర్ల సదయ్య, చలమల శివారెడ్డి, పల్లె కోటి, ఎర్ర రమేష్, మడికొండ కుమార్, దామర చిరంజీవి, ఒంటరి బాబు, కొయ్యడ సతీష్, శీను, రాజు, కమలమ్మ, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



శాయంపేట : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి ఆదివారం ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందగా ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి సోమవారం మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ సాంబరెడ్డి, నాయకులు రాజిరెడ్డి, చల్లా శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఈఓ



ఐనవోలు: తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొండా సురేఖను ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందించారు. మల్లన్నస్వామి చిత్రపటాన్ని మంత్రికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పాతర్లపాటి నరేష్ శర్మ, గట్లు మల్లన్న ఆయల అర్చకుడు వినయ్ శర్మ, సిబ్బంది శ్రీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కాడెద్దు మృతి



ఐనవోలు: మండలంలోని వెంకటాపురం గ్రామ శివారులో నందనబోయిన అంజయ్యకు చెందిన కాడెద్దు మృతి చెందింది. స్థానికులు, బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి అంజయ్య తన వ్యవసాయ బావి వద్ద దొడ్డిలో కాడెద్దును కట్టేసి ఎప్పటిలాగే ఇంటికి వచ్చాడు. తెల్లవారి బావి వద్దకు వెళ్లేసరికి మృతి చెంది ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు అమానుషంగా ఎద్దు నాలుకను కోసి విచక్షణ రహితంగా కొట్టి చంపేసినట్లు బాధితుడు వాపోయాడు. పోలీసులు విచారణ జరిపి దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుకుంటున్నారు. ఈ మేరకు బాధిత రైతు జఫర్‌ఘడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పార్కును సందర్శించిన విద్యార్థులు

ఖిలా వరంగల్: బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్ పార్కును వరంగల్ జిల్లా సంక్షేమాధికారి శారద ఆధ్వర్యంలో వర్ధన్నపేట, రాయపర్తికి చెందిన కేజీబీవీ విద్యార్థులు సోమవారం సందర్శించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. విద్యాశాఖ కోఆర్డినేటర్ ఫోరెన్స్, డీహెచ్ఈడబ్ల్యూ టీం, సఖి అడ్మిన్ శ్రీలత, సూపర్‌వైజర్ పద్మలత, యూడీసీ కుమార్, డీసీపీఓ రాజు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ప్రపంచ మానవ హక్కుల పోస్టర్ ఆవిష్కరణ

హన్మకొండ: ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం వాల్‌పోస్టర్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. హనుమకొండ సర్క్యూట్ హౌస్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రగతి సేవా సమితి, అభ్యుదయ సేవా సమితి ప్రతినిధులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు మండల పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

కార్తీకమాస ప్రత్యేక పూజలు



కమలాపూర్ : ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



వేలేరు : ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

కమలాపూర్: కార్తీకమాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో గల శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉప్పల్ చిన్న చెరువు మత్తడి వద్ద ఉన్న శ్రీమహాలింగమయ్యస్వామి దేవాలయానికి భక్తులు పెద్దెత్తున తరలివచ్చి అర్చనలు, అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూసాల ప్రకాశం, అర్చకులు, స్థానికులు, భక్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని మండలంలోని పీచర భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి లక్షబిల్వార్చన, రుద్రహోమం, ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రామలింగం, స్వార్థిక్, పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డీఎన్ఏ పరీక్షకైనా సిద్ధమే..



భార్య, కూతురుతో కలిసి దిగిన ఫొటోలు



కూతురుతో కలిసి భర్త ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న హసీనా

- భర్త ఇంటి ఎదుట భార్య, కూతురు ఆందోళన
- న్యాయం చేయాలని వేడుకోలు

పరకాల : బంధువుల ఇంటి వద్ద జరిగిన పరిచయం వారిలో ప్రేమ..పెళ్లికి దారితీసింది. మతాంతర వివాహం చేసుకున్న ఏడాదికి పాప జన్మించింది. ప్రస్తుతం ఆ పాప ఏడేళ్ల వయసు ఉంది. ఇంతలో ఏం జరిగిందో తెలియదు కానీ భార్య, బిడ్డను వదిలేసిన ఓ ప్రబుద్ధుడు మూడేళ్ల క్రితం తన సొంతూరు పరకాలకు పారిపోయి వచ్చాడు. దీంతో ఈ ఘటనపై ఆందోళన చెందిన భార్య కోర్టుకు వెళ్లింది. అయితే అక్కడ తనకు న్యాయం జరగలేదంటూ సోమవారం పరకాల పట్టణంలోని మల్లారెడ్డిపల్లె కాలనీలో తన భర్త రాయబారపు నితీష్ ఇంటి ఎదుట కూతురుతో కలిసి భార్య హసీనా ఆందోళన చేపట్టింది. తమ పెళ్లితోపాటు బిడ్డతో నితీష్ దిగిన ఫొటోలను విలేకరులకు చూపిస్తూ తనకు న్యాయం చేయాలని కోరింది. అవసరమైతే డీఎన్ఏ పరీక్షకైనా సిద్ధమని స్పష్టం చేసింది. తనకు భర్త.. కూతురుకు తండ్రి కావాలని వేడుకుంది. కాగా, చిన్నారితో కలిసి భర్త కోసం ఆందోళన చేపట్టడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. తనకు న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించే ప్రసక్తే లేదని తెలిపింది. కాగా, నితీష్ తల్లిదండ్రులు మాత్రం హసీనా వల్ల తమ కుమారుడి జీవితం నాశనమైందని పేర్కొన్నారు. తమ కుమారుడితో హసీనాకు ఉన్న సంబంధాలపై ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కోర్టు కేసు కొట్టివేసిందని పేర్కొన్నారు.

మల్లన్న ఆలయంలో మాస శివరాత్రి పూజలు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్రహోమం చేశారు. శ్రీమల్లికార్జునస్వామి కల్యాణం జరిపించారు. అలాగే ఒగ్గు పూజారులచే పట్నం వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు ఐనవోలు మధుకర్ శర్మ, వేద పండిట్ విక్రాంత్ వినాయక్‌జోషి, అర్చక సిబ్బంది పాల్గొన్నారు. మాస శివరాత్రి పూజల అనంతరం సుధావలి వర్ణ లేపనం కొరకు గర్భాలయం మూసి వేసినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. తిరిగి ఈ నెల 17న దృష్టికుంభం కార్యక్రమంతో గర్భాలయ దర్శనాలు మొదలవుతాయని ఈ సందర్భంగా ఈఓ వెల్లడించారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల కాగడాల ప్రదర్శన



కాగడాల ప్రదర్శనలో తపాలా ఉద్యోగులు

హన్మకొండ: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 12నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తున్న గ్రామీణ తపాలా ఉద్యోగులు తమ నిరసనలో భాగంగా సోమవారం రాత్రి కాగడాల ప్రదర్శన నిర్వహించారు. హనుమకొండలోని కాళోజీ విగ్రహం నుంచి తెలంగాణ అమరవీరుల స్తూపం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ కార్యదర్శి బొద్దున వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కమలేష్ చంద్ర కమిటీ నివేదికలోని అనుకూల సిఫార్సులను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం, తపాలా శాఖ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ అధ్యక్షుడు మర్రి కొమురారెడ్డి, నాయకులు అశోక్, చంద్రమౌళి, రజనీకాంత్, ఉదయ్ పవన్, యూసుపొద్దీన్, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

ఈద్గా అభివృద్ధికి కృషి చేయాలి



సురేఖ, మురళిని సన్మానిస్తున్న జబ్బార్, ముస్లింలు



కొండా దంపతులతో సిక్కులు

ఖిలా వరంగల్: ఈద్గా, మసీదు అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని మంత్రి కొండా సురేఖను ఈద్గా ప్రతినిధి, తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ జబ్బార్ కోరారు. ఈమేరకు రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొండా సురేఖను పలువురు ముస్లింలతో కలిసి హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో జబ్బార్ సోమవారం మర్యాద పూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుకు పుష్పగుచ్ఛాలు అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

వరంగల్: మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును హైదరాబాద్‌లోని వారి స్వగృహంలో అర్చకులు సన్మానించారు. మంత్రి కొండా సురేఖ, మురళీధర్‌రావు దంపతులను నగరంలోని 26వ డివిజన్‌కు చెందిన సిక్కులు హైదరాబాద్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

యాచకులకు బ్లాంకెట్ల పంపిణీ

కాజీపేట రూరల్: భిక్షాటన చేసే యాచకులకు కాజీపేట రైల్వే దేవాలయ ప్రాంగణంలో కాకతీయ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పెసరు తిలక్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిలక్‌కుమార్ మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ట్రస్ట్ ఆధ్వర్యంలో చలికాలంలో యాచకులకు బ్లాంకెట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈసారి కూడా 60మందికి అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నాంపెల్లి శ్రీనివాస్, గాజుల సంపత్, ఇండ్ల కిరణ్‌కుమార్, కంటమ్ శ్రీనివాస్, సాధినేని సూర్యనారాయణ, పెసరు తిలక్‌కుమార్, బెరపాక పరశురాములు గోపాల్‌రావు, రమేష్, సారంగం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు.. రేపు

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట కురుమ కులసంఘం భవనంలో ఆయుష్, ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉచిత ఆయుర్వే వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కురుమ సంఘం మండల పరశురాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరానికి ఆయుర్వేద సీనియర్ వైద్యులు వస్తున్నారని, ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

18న సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం

ఖిలా వరంగల్: ఈనెల 18న వరంగల్ శంభునిపేట ఉర్సు సుభాష్‌నగర్‌లోని నాగేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహణాధికారి (ఈఓ) ఆర్.కమల, అర్చకుడు జాగర్లపూడి శ్రీరామశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొనే భక్తులు ముందుగా రూ.1116లు చెల్లించి రశీదు పొందాలని పేర్కొన్నారు.

19న 'జైహో' 2వ జాతీయ సమ్మేళనం

నయీంనగర్: ఈనెల 19న ఆంధ్రప్రదేశ్ నెల్లూరు పెన్నానది తీరాన పల్లిపాడు గ్రామంలో సత్యాగ్రహ ఆశ్రమంలో జైహో 2 జాతీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు జైహో ఏపీ రాష్ట్ర కార్యదర్శి రాబర్ట్ ఖదిజ్హాసి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 102 సంవత్సరాల క్రితం మహాత్మాగాంధీ హస్తాలతో ప్రారంభమైన పినాకిని సత్యాగ్రహ (గాంధీ) ఆశ్రమంలో దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించనున్న జాతీయ సమ్మేళనానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాకేష్, మనీష్, ప్రవీణ్, సరోజన, మమత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

1న అయ్యప్పస్వామికి పూజలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ భద్రకాళి రోడ్డులోని ధర్మశాస్తా అయ్యప్ప భక్తసేవాశ్రమంలో వచ్చే జనవరి 1న అయ్యప్ప స్వామికి విశేష పూజలు, భక్తులకు మహా అన్నప్రసాదాల వితరణ చేయనున్నట్లు ఆలయ అర్చకుడు గణపతిశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 97006 91129 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు దివ్యాంగులకు క్రీడా పోటీలు

కాళోజీ సెంటర్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వరంగల్‌జిల్లాలోని దివ్యాంగులకు ఈనెల 13న(రేపు) క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి ఎం.శారద ఒక ప్రకటనలో తెలిపారు.

విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాళోజీ సెంటర్: జర్మనీలో చదువుతో పాటు ఉద్యోగాలు కల్పించనున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ, రిజిస్టర్డ్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 63022 92450, 79012 90580 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మంత్రి సీతక్కను కలిసిన టీఎస్ ఈఈయూ నేతలు



హన్మకొండ: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్ఈఈయూ) -327 నాయకులు హైదరాబాద్‌లో సోమవారం కలిశారు. ఈమేరకు సీతక్కకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, టీఎస్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ తులసి శ్రీమతి, నాయకులు ఎం.బుచ్చయ్య గౌడ్, డీ.సదయ్య, రాంచందర్, వేణురెడ్డి, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని తొలగించిన అధికారులు



గ్యాస్ కట్టర్‌తో తొలగిస్తున్న ఐరన్ స్తంభం

శాయంపేట : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభాన్ని విద్యుత్‌శాఖ అధికారులు సోమవారం తొలగించారు. మాందారిపేట నుంచి ప్రగతిసింగారం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టగా, మండల కేంద్రంలోని బీసీకాలని నుంచి ఎస్సీ కాలని వరకు సీసీ రోడ్డు పనులు చేపట్టారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టే ముందు విద్యుత్ స్తంభాల తొలగింపు పనులు చేపట్టాలి. కానీ విద్యుత్ స్తంభాల తొలగింపు పక్రియ లేకుండానే సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు పనులను పూర్తి చేశాడు. గతంలో వేసిన విద్యుత్ స్తంభాలు వాహనదారులకు ఆటంకంగా మారుతున్నాయి. విద్యుత్ అధికారులు 10 విద్యుత్ స్తంభాలు వేసినప్పటికీ విద్యుత్ వైర్లను మాత్రం క్రమబద్ధీకరించలేదు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఎదురుగా ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభం రోడ్డుకి అడ్డుగా, ప్రమాదకరంగా ఉండడంతో విద్యుత్‌శాఖ ఏడిఏ దేవేందర్ నాయక్, ఏఈ రాజ్‌కుమార్, లైన్ ఇన్స్‌పెక్టర్ దామోదర్, లైన్‌మెన్ సంతోష్, జేఎల్ఎం విష్ణు, విద్యుత్ సిబ్బందితో సోమవారం విద్యుత్ ఐరన్ స్తంభాన్ని గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి తొలగించారు. ఎట్టకేలకు ఐరన్ విద్యుత్ స్తంభం తొలగించడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన హైమావతి



హైమావతికి కండువా కప్పుతున్న జెడ్పీటీసీ

ఆత్మకూరు : తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం మహిళా ప్రచార కార్యదర్శి ఓదెల హైమావతి సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు ఆత్మకూరు జెడ్పీటీసీ కక్కెర్ల రాధికరాజు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. జయశంకర్ సార్ తన సిద్ధాంతం తో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఉదారని, ఆయన సేవలని జాతి ఎప్పటికీ మరువదన్నారు. అక్కంపేట గ్రామాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రెవెన్యూ గ్రామంగా ప్రకటించిందని, దీంతో గ్రామస్తులు చిరకాల కోరిక నెరవేరిందన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అక్కంపేటను రెవెన్యూ గ్రామంగా ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

విద్యుత్ తీగలను సవరించిన అధికారులు

- సాక్షి కథనానికి స్పందన



వేలాడుతున్న తీగలను సరి చేసిన అధికారులు

ఐనవోలు: ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను విద్యుత్‌శాఖ అధికారులు సవరించారు. ఈ నెల 9వ తేదీన 'సాక్షి' లో 'వేలాడుతున్న మృత్యుపాశాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో వేగంగా స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు శనివారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ వేలాడుతున్న తీగలను సవరింపు, మిడిల్ పోల్ ఏర్పాటు, శిథిలమైన స్తంభాల మార్పుపై నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పించారు. ఆదివారం విద్యుత్ సిబ్బంది 5 నూతన పోల్లు ఏర్పాటు చేసి వేలాడుతున్న తీగలను రాత్రి 7 గంటల వరకు సవరించారు. ఐదు సంవత్సరాలుగా వేధిస్తున్న సమస్య సాక్షి కథనంతో తీరడంతో రైతులు నీరటి రాంబాబు, కట్కూరి రాజులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ విశాలి

వేలేరు : ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ విశాలి అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఉదయాన్నే వ్యాయామం చేయాలని, శారీరక, మానసికొల్లాసం కోసం క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రౌతు అజయ్‌కుమార్, హెల్త్ హెడ్యూకేటర్ వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ కుమారస్వామి, ఏఎన్ఎం రమాదేవి, స్టాఫ్ నర్సు యమున పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధి యువత ద్వారానే సాధ్యమని, అందుకు వారికి కావాల్సిన శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని కోరారు. అప్పుడే వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదిగి అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రతి గ్రామంలో 10 మంది యువకులను ఎంపిక చేసి మండలానికి 100 మంది యువకులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉద్యోగ రంగాల్లో రాణించేలా పోలీసు శాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. మెరుగైన ప్రణాళిక తయారు కోసం ఈ నెల 21వ తేదీన జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, శాయంపేట సీఐలు వెంకటరత్నం, మల్లేశం, ఎస్సైలతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పరకాల: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరైనందున త్వరగా పనులు చేపట్టేందుకు కృషి చేయాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కళాశాల అభివృద్ధికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ రాజయ్య, అశోక్‌మోరె, ఓదేలు, రవికుమార్, డాక్టర్ అనిల్‌కుమార్, దుప్పటి సంజయ్ ఉన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

ఆత్మకూరు : గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేసుకోవాలని హెచ్‌పీ గ్యాస్ సంస్థ డిస్ట్రిబ్యూటర్ విజయ్‌కుమార్, మేనేజర్ ప్రవీణ్ ప్రకటనలో కోరారు. మృతుల పేరుతో గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు కేంద్రం గుర్తించిందని, వాటన్నింటినీ సవరించాలని ఉద్దేశ్యంతో ఈ-కేవైసీ చేపట్టినట్లు తెలిపారు. వినియోదారుల ఆధార్ కార్డుతో అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే రాయితీకి ఈ-కేవైసీకి ఎలాంటి సంబంధం లేదని ప్రవీణ్ స్పష్టం చేశారు. ఈ-కేవైసీకి ఎలాంటి గడువు ప్రకటించలేదని, గ్యాస్ వినియోగదారులు తప్పనిసరిగా ఈ -కేవైసీ చేసుకోవాలని కోరారు.